# 3

# మనిషిలో మనిషి

"ఏవిటండీ... ఏదో ఆలోచనలో మునిగిపోయారు?"

"ఈ యుగం ఎప్పుడంతం అయిపోతుందా అని... తొందరగా అంతం అయిపోతే బావుండునని ఆలోచిస్తున్నాను" ఎటో చూస్తూ జవాబిచ్చాడు శ్రీహరి.

"కాఫీ ఇవ్వడం ఒక్క అయిదు నిమిషాలు ఆలస్యమైనందుకా?"

"జోక్‌గా అనట్లేదు నళినీ..."

భర్త మొహంలోకి ఒక్కక్షణం చూసి కాఫీ కప్పు చేతిలో పెట్టి ఎదురుగా కూచుంది నళిని.

"ఊ... చెప్పండి. ఎందుకంత హఠాత్తుగా మీకలా అనిపించిందిప్పుడు?"

"హఠాత్తుగా కాదు. ఎప్పటినుంచో నాకీరకమైన ఆలోచన్లు వస్తూనే ఉన్నాయి".

"ఎందుకో...?" దీర్ఘం తీసింది నళిని.

"ఎందుకేమిటి? రోజు రోజుకీ పెరిగిపోతున్న సాంకేతిక విజ్ఞానం మూలంగా అన్నిరకాల తెలివి తేటలతో పాటు ఘోరాలు నేరాలు పాపాలూ చెయ్యరాని పన్లెన్నో పెచ్చుమీరిపోతున్నాయి. ఈ తరం పిల్లల్ని చూసినా భయంగానే ఉంది. నాలుగేళ్ళ పిల్లాడు కూడా ఎదురు సమాధానాలు చెప్పడానికి జంకడు.

ఏడెనిమిదేళ్ళ పిల్లాడు కూడా అఘాయిత్యాలు చెయ్యడానికి వెనకాడడు. పైగా... సినిమాల్లో చూసి నేర్చుకున్నాను... టీవీల్లో చూసి నేర్చుకున్నానంటాడు. బాత్‌రూముల్లో వీడియో కెమెరాలు పెట్టి ఆడవాళ్ళ పరువు బజారుకీడ్చే దుర్మార్గులు కొందరు..."

"బాబోయ్! ఇంక చెప్పకండి. రోజూ ఇలాంటివి దినపత్రికల్లో చదువుతూనే ఉన్నాం..."

"ఔను కదా! మరలాంటివి చదివినప్పుడైనా... విన్నప్పుడైనా ఏ ప్రళయమో వచ్చి పూర్తిగా ప్రపంచాన్ని ముంచెయ్యాలని అనిపించదా నీకు?"

"అదేమో తెలియదు గానీ కడుపులోంచి బాధ తన్నుకొస్తుంది".

"మనిషికిన్ని తెలివితేటలెందుకు చెప్పు?"

"ఎందుకేవిటి? వినాశకాలే విపరీత బుద్ధిః అన్నారు పెద్దలు... కానీ మన మాటలు విన్నవాళ్ళు మనల్ని వెర్రి వెంగళప్పల్ని చూసినట్టు చూస్తారండీ... సాంకేతిక విజ్ఞానం సాధించకపోతే ఎలాగంటారు..." ఎవరో తలుపు కొట్టిన చప్పుడై లేచింది నళిని.

నాలుగు రోజులుగా పన్లోకి రాని కనకం కనిపించే సరికి అమ్మయ్య అనుకుంది.

"ఏవిటి కనకం... చెప్పా పెట్టకుండా నాల్రోజులు మానేశావు...?"

"ఏం చెప్పేదమ్మా... ఉన్న పాట్న మా ఊరికి పోయే పని పడింది..." అంటూనే కళ్ళ నీళ్ళతో వంటింటి గుమ్మం దగ్గిర చతికిలపడింది వచ్చి.

"ఏం జరిగింది?" అడగకుండా ఉండలేక పోయింది నళిని.

"మా చెల్లి కూతుర్ని అయిదేళ్ళ పసిదాన్ని పక్కింట్లో ఉండే యాబయ్యేళ్ళ వాడు తాగొచ్చి పాడుచేసి పోయాడమ్మా... కలికాలం... కలికాలం..." రెండు చేతుల్తో తల కొట్టుకుంది.

"చూశావా ఎంత ఘోరమో?... కలికాలం అని పనిమనిషి కూడా బాధపడుతోంది. మనకీ ఓ ఆడపిల్ల ఉంది. అదే నా దిగులూ... నా భయం..."

ఆమెని ఓదార్చి ఇవతలికి వచ్చిన భార్యతో అన్నాడు శ్రీహరి.

"భలేవారండీ... మనింట్లో ఒక్కింట్లోనేనా ఎంతమంది ఇళ్ళల్లో ఆడపిల్లల్లేరూ?"

"నువ్వసలు ఆడపిల్ల తల్లిలా మాట్లాడట్లేదు".

తెల్లబోయింది.

"మీ అమ్మ నీకు ప్రేమాభిమానాలు నేర్పలేదు..."

స్థాణువే అయిపోయింది నళిని. బాధ కలిగినా బయటపడలేదు. నిగ్రహించుకుంది.

"ఏవిటో... రోజురోజుకీ మాటలు కొత్తగా ఉంటున్నాయి. అంతేకాదు మీ వైఖరిలో ఏదో మార్పు కనిపిస్తోంది. అది నా దృష్టి లోపం కావచ్చులెండి" నవ్వేసింది. వాతావరణం తేలికపరచాలన్న ఉద్దేశంతో.

"మనమ్మాయి గురించి మాటాడుతుంటే... నన్ను విమర్శిస్తున్నావేంటి?" ఆ గొంతులోని కరుకుదనానికి బెదిరిన మాట వాస్తవం.

అతని కోపం తనకి తెలియనిది కాదు. ఎందుకొస్తుందో తెలియదు. ఎప్పుడు పోతుందో తెలియదు. అరవడం ఒక్కటే అతనికి తెలిసిన విషయం అనిపిస్తుంది. అందుకే సాధ్యమైనంత నెమ్మదిగా జవాబిచ్చింది.

"మనమ్మాయికి మంచి ప్రేమాభిమానాలు, మంచి భద్రతా ఇచ్చే పెంచుతున్నా నండీ నా శయశక్తులా. రోజులు బాగా లేవు. అది నాక్కూడా కలత కలిగించే విషయమే. మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటూ చూసుకుంటున్నాను".

ఆ మాటలు అతనిలోని అహాన్ని చల్లార్చినట్టే అనిపించింది.

అయినదానికీ కానిదానికీ అప్పుడప్పుడు కట్టుకున్న దానిమీద చిందులు తొక్కే అతని నైజం ఎల్లలు లేని ఆనందాన్ని పొందింది.

ముడుచుకుపోయిన పువ్వులా మౌనమైపోయిందింక నళిని.

ఆమెకి తెలుసు. అతని గొంతులోని మార్పు... మాటలోని తీరు... వాదనకి తావే ఇవ్వదు. రెండు చేతులూ కలిస్తేనే కదా చప్పుడని తన చేయి ఎక్కడుందో తనకే తెలియనట్టు దాచుకుంటుంది.

ప్రతిసారీ ఏ సందర్భంలోనైనా సరే మాటలు పేర్చుకుని మంచి ముత్యాలల్లే వాడేందుకే ప్రయత్నిస్తుంది.

✧ ✧ ✧

"ఈ రోజు నేను ఆఫీసులో ఉండను. పొద్దున్నించీ సాయంత్రం దాకా ఆఫీసు పనిమీద బయట తిరగాల్సి ఉంది" ఆఫీసుకి వెళ్ళేటప్పుడు చెప్పేశాడు శ్రీహరి. తను

లేనప్పుడు ఎందుకోసమైనా అవసరపడితే హఠాత్తుగా ఆఫీసు ఫోనుకి చేస్తుందేమోనన్న భయం. అందుకే ఆ అబద్ధం.

మధ్యాహ్నం నళిని తన చీరకి ఫాల్ కుట్టుకుందామని కూచోబోతుండగా ఫోన్ మోగింది. హలో అనగానే అవతలివాళ్ళు చెప్పిన కబురు వింటూనే చలనం లేనట్టు బిగుసుకుపోయింది. తిని తిరుగుతున్న మనిషి... మావగారు మాసివ్ ఎటాక్ వచ్చి పోయారన్నదే ఆ కబురు. బుర్ర పనిచెయ్యడానికి రెండు మూడు నిమిషాలు పట్టింది. ఇవాళంతా బయట తిరిగేపన్లే అన్నాడు కదా వెళ్ళేటప్పుడు... మొబైల్‌కి చేసింది. "ఏవిటీ?" భర్త స్వరంలో విసుగు గమనించింది. ఆఫీసు పనుల్లో తలమునకలయ్యే వ్యక్తికి ఆ మాత్రం విసుగు సహజమే అనుకుంది. "మావయ్యగారు... మావయ్యగారు" ఏడుపొచ్చింది. మాట పూర్తి చెయ్యలేకపోయింది. భార్య గొంతులోని దుఃఖం చెవులు పసిగట్టాయి. కానీ మనసు దాన్ని పట్టించుకోదల్చుకోలేదు.

"ఏవిటో చెప్పు..." ఆ పలికిన తీరు చిరాకుని బాగానే వ్యక్తం చేసింది.

"హార్ట్ ఎటాక్ వచ్చిందట... మావయ్యగారు పోయారుట".

"బట్టలు సర్దిపెట్టు సూట్‌కేస్‌లో... ఏదో ఓ బస్సుకి టిక్కెట్లు కొనుక్కొస్తాను... రాత్రి బయల్దేరదాం" మొబైల్ ఆఫ్ చేశాడు.

అంత నిర్లిప్తంగా చాలా మామూలుగా అటువైపు నించి వచ్చిన సమాధానానికి ఆశ్చర్యపోయింది.

"ఎవరు? మీ ఆవిడా ఫోన్ చేసింది?" అదోలా అడిగింది ఊర్వశి. ఆమెతో అతని అక్రమ సంబంధం గురించి నళినికేం తెలుసు పాపం! ఆఫీసు పన్లమీద బయటికి వెళ్తున్నానంటూ అప్పుడప్పుడు ఊర్వశితో గడపడానికి వెళ్ళే అతని పాడుబుద్ధి ఆమెకి తెలియదు. ఆమెకి తెల్సిందల్లా కట్టుకున్న వాడిని మనస్ఫూర్తిగా నమ్మడమే. ఊర్వశి అనే మనిషాకత్తి తనకీ తన భర్తకీ మధ్యలో వచ్చిందన్న విషయం ఎరగనే ఎరగదు.

"ఎవరు? మీ ఆవిడేగా?" మొబైల్ వంక చూపిస్తూ వంకర నవ్వు నవ్వింది ఊర్వశి.

"ఊ... నీ పుట్టిన రోజునాడు నీతో నీ ఇంట్లో గడిపేందుకు సెలవు పెట్టడమే కాదు... ఆఫీసు పనిమీద ఈ రోజంతా బయట తిరగాలని చెప్పేశాను దానికి.

సాంకేతిక విజ్ఞానం పెరగడం మంచిది కాదని తెగ కబుర్లు చెప్పేస్తుంటాను ఆవిడగారి దగ్గర. ఈ సెల్ ఫోన్ లేకపోతే అయ్యేది నా పని. అవసర సమయాల్లో ఆఫీసు నెంబరుకి చేస్తుంది కదా ఏదైనా కబురు చెప్పాలంటే అప్పుడాఫీసులో వాళ్ళు నేను సెలవు పెట్టిన విషయం చెప్పెయ్యరూ? పట్టుబడిపోతాను".

"మన మధ్య సంబంధం మీ ఆవిడకి తెలియకుండా బాగానే నాటకాలాడుతున్నావు".

"నాటకాలాడటం నన్ను చూసే నేర్చుకోవాలి ఎవరైనా..." మీసం తిప్పాడు.

"అబ్బో! ఇంకేం నాటకాలాడుతున్నావు? చెప్పు... చెప్పు" గారంగా వగలుపోయింది ఊర్వశి.

"ప్రతినెలా ఆఫీసు అడ్రసుతోనే మా చెల్లిలికి కొంత డబ్బు పంపిస్తుంటాను నా జీతంలోంచి".

"మీ ఆవిడకి తెలియదా?"

"తెలియదు. నేనూ చెప్పను. మా చెల్లెలూ చెప్పదుగా!"

"అయినా నీకంటే ముందే ఎప్పుడో పెళ్ళయి భర్తా పిల్లల్తో ఉన్న మీ చెల్లెలికి ప్రతినెలా నువ్వెందుకూ డబ్బు పంపడం?" వింతగా చూసింది.

"నా పెళ్ళి కాకముందు చాలా చిల్లర వేషాలు వేసేవాడిని. ప్రేమించానంటూ ఒకోసారి ఒకో అమ్మాయి వెంటపడి తిరగడం... బుట్టలో వేసుకోవడం... ప్రతి వాళ్ళనీ గంగలో ముంచడం... ఈ విషయాలన్నీ మా ఆవిడకి చెప్తానని బెదిరిస్తూ ఉంటుంది చెల్లెలు. అందుకని డబ్బు పంపిస్తూ... అబ్బో! మా అన్నయ్యే అన్నయ్య... మా అన్నయ్యంత మంచివాడు లేడని అనిపించుకుంటూ ఉంటాను. ఇదో టెక్నిక్ అనుకో. తేరగా వచ్చే డబ్బు దానికి మాత్రం చేదా?"

"ఇంత కథ ఉందన్నమాట నీ వెనకాల? గ్రంథసాంగుడివే".

"చెప్తూ పోతే ఎంత కథయినా ఉందిలే. ఇంక ఆ కథ వదిలేసి ప్రస్తుతం మన కథలోకి వచ్చేద్దామా?"

ఆ ప్రశ్నకి ముసి ముసి నవ్వుల జవాబిచ్చింది ఊర్వశి.

✧ ✧ ✧

దహన కార్యక్రమాలు పూర్తయిన మర్నాడు అత్తగారొక్కరూ గదిలో గోడకానుకుని కళ్ళు మూసుకుని కూచునుంటే నెమ్మదిగా వెళ్ళి పక్కనే కూచుంది నళిని. ఆవిడకి ధైర్యం చెప్పాలి. మాటలు మనసులో కూడదీసుకుంటోంది. అవి పెదవుల దాకా రాకుండానే అత్తగారే ముందు మాట్లాడింది కోడలి భుజమ్మీద చెయ్యి వేసి.

"నేను చాలా పెద్ద పొరపాటు చేశాను నళినీ" పక్కనే ఉన్న తనకి మాత్రమే వినపడేలా నెమ్మదిగా ఆవిడా మాట అనడం గమనించింది నళిని. "మొదట్లోనే నా భర్త చేసే తప్పుల్ని ఎత్తి చూపి సరిదిద్దే ప్రయత్నం చేసి ఉండవలసింది నేను. చెయ్యలేదు. ఆయన కొట్టినా తిట్టినా చీటికీ మాటికీ ప్రతి విషయానికీ నా మీద అలిగినా పతివ్రతననిపించేసుకోవాలన్న పిచ్చి తపనతో భరించాను. అదే నేను చేసిన తప్పు. ఆ మనిషి పెట్టుకున్న చీకటి సంబంధం గురించి కర్ణాకర్ణికగా విని కూడా మొదట్లోనే ఖండించకుండా పెద్ద పొరపాటు చేశాను".

నళినికిది నమ్మశక్యంగా లేదు. విస్మయంగా వింటోంది.

పెళ్ళయినప్పటినుంచీ ఎక్కడో దూరభారాన కాపురం. మావగారి గురించి తాను విన్నది లేదు... తనతో చెప్పేవాళ్ళూ లేరు.

శ్రీహరి గదిలో అడుగుపెట్టడంతో మాటలాపేసి మొహం తిప్పుకుంది అన్నపూర్ణ. కొడుకు మొహంలోకి చూడాలనిపించలేదావిడకి.

"అమ్మా!" ఎదురుగా కూచున్నాడు శ్రీహరి.

"నాన్నగారికింతలా ముంచుకు రావడం... అది కూడా మొట్టమొదటిసారే సివియర్‌గా ప్రాణంమీది కొచ్చెయ్యడం ఏవిటమ్మా?"

"ఔను... నిజానికి ఆయనక్కాదు నాకు రావాల్సింది. నేను చేసిన పొరపాటుకి శిక్షగా ఆ భగవంతుడు నన్ను తీసుకుపోవల్సింది... నా ఆయుష్షు కడతేర్చవలసింది".

"ఏంటమ్మా? నిన్ను నువ్వెందుకలా అనుకుంటావు? నువ్వేం చేశావు?"

"చేశాను. రెండు తప్పులు చేశాను... వాటిని పొరపాట్లు అంటే సరిపోదు. తప్పులనే చెప్పాలి. పతివ్రతననిపించుకోవాలని ఆ మనిషి చేసిన పనికిమాలిన పన్లన్నీ సహించాను. అదొక తప్పు. ఇంక రెండోది తోటకూరనాడే నిన్ను వంచకపోవటం".

ఉలిక్కిపడ్డాడు... ఇదేవన్నా నా మీద ఫిర్యాదుగానీ చేసిందా? భార్య వంక చూశాడు.

"అనుమానం ముందుపుట్టి ఆడది తర్వాత పుట్టిందంటారు గానీ తన భర్తలాంటి అనుమానప్పురుగులు ఆడవాళ్ళల్లో కూడా ఉండరేమో?" శ్రీహరి చూసిన చూపుకి నళిని మనసులో కదలిక అది...

గది బయటనించి ఎవరో పిలవడంతో లేచి నెమ్మదిగా అవతలికి వెళ్ళింది అన్నపూర్ణ.

"నా మీద ఏం చెప్పావు మా అమ్మకి?" మింగేసేలా చూస్తూ పళ్ళు బిగబట్టి అడిగాడు శ్రీహరి.

"నేనేం చెప్పలేదే!"

"మరెందుకలా అంటోంది?"

"మొదలూ చివరా అర్థంకాక నేనుంటే నన్నడుగుతున్నారు మీరు..."

"ఏవో నా గురించి పితూరీలు చెప్పే ఉంటావు..."

"నేను చెప్తేగానీ మీ కన్నతల్లికి మీ బుద్ధులు తెలియవంటారా?"

"నోర్ముయ్... ఇంక అంతటితో ఆపు" కర్కశమైన గొంతులో అథారిటీ. తప్పులు చేసే మగాడు భార్యమీద అరవడం గొప్పనుకుంటాడు.

కాసేపట్లో మళ్ళీ అత్తగారు లోపలికొచ్చి కూచుంటూ కొడుకువైపోసారి చూసి చిన్నగా అన్నమాటలు చెవినపడినా కూడా అర్థంకాని సినిమా చూస్తున్నట్టనిపించింది నళినికి. "ఆ మనిషొచ్చింది. ఓ ఎకరం పొలమైనా తనకి రాసి తీరాలని చెప్పి వెళ్ళింది" ఇవీ ఆవిడన్న మాటలు. అర్థమైంది శ్రీహరికి. ఊ అన్నాడు తల్లివైపు చూడటానిక్కూడా మొహం చెల్లక. మూలిగినట్టుగా వచ్చింది అతని గొంతులోంచి ధ్వని. మెల్లిగా లేచి ఆ గదిలోంచి బయటికి వెళ్ళిపోయాడు.

"ఆ వచ్చిన మనిషెవరూ... ఎకరం పొలం రాసివ్వడం ఏమిటని ఆలోచిస్తున్నావు కదూ?"

అత్తగారి ప్రశ్నకి ఔనన్నట్టుగా తల ఊపింది నళిని.

"మీ మామగారు రహస్యంగా చేస్తున్నాననుకుంటూ చేసిన చీకటి తప్పుల్లో ఇది కూడా ఒకటి. ఆయనగారు చేరదీసిన మనిషీవిడ..."

నోరు నొక్కుకుంది నళిని. "ఇంట్లో దేవతలాంటి భార్య మీరు..."

"వద్దు..." రెండు చేతులూ జోడిస్తూ దండం పెట్టింది అన్నపూర్ణ. "రాక్షసుడి భార్య రాక్షసే అయిపోవాలి. దేవతగా ఉండాలనుకుని పెద్ద తప్పిందం చేశాను. అదే పొరపాటు నువ్వూ చేయకు".

ఆవిడన్న ఆఖరి మాటకి ఆశ్చర్యపోయింది నళిని.

"అప్పుడప్పుడు నీమీద చెయ్యెత్తుతాడు కదూ శ్రీహరి?" సూటిగా వచ్చింది ప్రశ్న.

గబుక్కున కళ్ళు వాల్చేసి తలదించుకుంది. "ఇక నించీ నీ మీద చెయ్యి ఎత్తితే ఊరుకోవద్దు. ఈ మాట ఇదివరకెప్పుడూ చెప్పలేదేమిటన్న సందేహం నీకు రావచ్చు. ఇదివరకు మరొకరికి చెప్పే అర్హత నాకు లేదు. ఎందుకంటే నా మీద చెయ్యెత్తే మనిషొకడుండేవాడు. చేతులు ముడుచుకుని నేనుండేదాన్ని. ఇంక నీకు చెప్పే అర్హత నాకెక్కడుంది?"

ఆవిడ మంచితనానికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి నళినికి. తన కొడుకు తిట్టినా కొట్టినా సహించవద్దని కోడలికి చెప్తున్న ఆ మనిషిలోని మరో మనిషిని చూసి చేతులు జోడించింది.

"నీకు తెలియని విషయం ఒకటి చెప్తాను విని ఏడవాల్సిన అవసరం లేదు. నా ఖర్మ ఇలా కాలిందా అని కుంగిపోయి కూర్చోవాల్సిన అవసరం అంతకంటే లేదు. ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో మంచి ఆలోచన చేసి మీ ఆయనకి బుద్ధి వచ్చేలా నువ్వేం చేసినా నాకు సమ్మతమే. నా అందదండలు నీకెప్పుడూ ఉంటాయి. నేను నీ పక్షమే. మా పెద్దనాన్న కొడుకు ఏవో పన్లమీద అప్పుడప్పుడు మీ ఉద్యోగపు ఊరొచ్చి వెళ్తుంటాడు కదా... అతను చెప్పాడు... శ్రీహరికీ... అదే మీ ఆయనకీ ఓ చిన్నిల్లుందిట అక్కడ"... నెత్తిన పిడుగు పడినట్టయింది నళినికి. కాసేపట్లోనే సద్దుకుంది అత్తగారి మాటలు మంచి ఔషధంలా పనిచెయ్యడం వల్ల.

"ఎంతమందో ఆడపిల్లల్ని మోసం చేసి ఏడిపించాడు పెళ్ళికి ముందు. పెళ్ళి చేస్తే మారతాడంటూ మీ మామగారు చేసిన నిర్వాకమే ఈ పెళ్ళి. కొడుక్కి మంచీ చెడూ చెప్పనిచ్చేవారు కాదు నన్ను. ఆడదానికి మాట్లాడే హక్కు లేదాయన దృష్టిలో..."

అత్తగారిలోని మరో మనిషి చేతులు జోడించ తగ్గ మనిషి... కానీ తన భర్తలోని మరో మనిషి?... తన కూతురికెంత భద్రత కావాలని అనుకుంటున్నాడో... తన కూతురికి ఏ మగవాడివల్లా ఏ కష్టనష్టాలూ కలగకుండా క్షేమంగా బయటి ప్రపంచంలో జీవించగలగాలని కోరుకుంటున్నాడో అదే రీతి వేరే ఆడపిల్లలకీ, ఇతర స్త్రీలకీ అక్కర్లేదనుకుంటున్న 'ఓ మృగం' అతనిలోని మరో మనిషి. ఆ మృగాన్ని పారదోలేందుకు... శక్తియుక్తి ఆత్మవిశ్వాసాల కలయికతో తనలో నిద్రాణమై ఉన్న మరో మనిషిని మేలుకొలిపేందుకు సందేహమెందుకు?

ఈ ఆలోచనతో నళిని మనసు తెరిపిన పడింది.

*పత్రిక మాసపత్రిక, డిసెంబర్ 2008*